# కొత్త అనుభూతి

**న**వ్యా... నీకు నేనిలా ఉత్తరం రాయటం ఆశ్చర్యంగా ఉందికదూ? కారణం ఏమిటో పూర్తిగా చదివితే నీకే తెలుస్తుంది. మధ్యలోనే చదవటం ఆపేయకేం!

ఈ రోజు ఉదయం మనిద్దరి మధ్యా జరిగిన సంభాషణ గుర్తుందిగా! నిన్న నిన్ను చూడటానికి మనింటికి వచ్చిన కమల ఆంటీ వాళ్ళ బంధువుల అబ్బాయి గురించి నీ అభిప్రాయం అడిగాను. వాళ్ళు నిన్ననే వాళ్ళకి అంగీకారమేనని చెప్పారు. వాళ్ళు వెళ్ళాక నిన్ను అడిగితే ఏమీ చెప్పలేదు. నీ ఇష్టం ఏమిటో తెలిస్తే వాళ్ళతో మాట్లాడవచ్చని నాన్న అంటే, ఉదయం నీ దగ్గర ఈ విషయం కదిపాను. దానికి నువ్వు "అతని మాటలనుబట్టి అతనికి ఆడవాళ్ళు ఉద్యోగం చేయటం అంతగా ఇష్టం ఉండదేమోననిపించింది. నాకేమో పెళ్ళయ్యాక కూడా రీసెర్చి చేయాలనీ ఆ తరవాత జాబ్ చేయాలనీ ఉంది. అతని అభిప్రాయాలేమిటో స్పష్టంగా తెలుసుకోవాలి. ఒకసారి ఫోను చేసి మాట్లాడాలి" అన్నావు.

"అలా అయితే, పెళ్ళి, జీవితం గురించి నీ అభిప్రాయాలూ... ఆలోచనలూ... ఆశలూ అన్నీ వివరంగా ఉత్తరంరాయి" అన్నాను. నేనేదో చాలా అసమంజసమైన విషయం చెప్పినట్లుగా ఆశ్చర్యంగా చూసి "ఏమిటీ... ఉత్తరం రాయాలా?!" అన్నావు.

"అవును. ఉత్తరం రాస్తేనే బావుంటుంది. ఫోనులో కంటే ఉత్తరంలో అయితేనే నీ అభిప్రాయాలన్నీ వివరంగా చెప్పగలుగుతావు కదా!" అన్నాను.

పెద్దగా పకపకా నవ్వావు.

"నువ్వు భలే చెప్పావమ్మా! ఈ రోజుల్లో ఉత్తరాలు ఎవరు రాస్తారూ...! నేను ఉత్తరం రాస్తే, రెండు రోజులకి అతనికి అంది... ఆ తరవాత రెండు రోజులు టైము తీసుకుని తను రాస్తే ఇంకో

రెండు రోజుల తరువాత నాకు అందుతుంది! ఫోనులో అయితే నాలుగు నిమిషాల్లో తేలిపోయేదానికి ఇలా వారంరోజుల కార్యక్రమం దేనికి చెప్పు...! మీ రోజుల్లో అయితే అందరికీ ఫోనులుండేవికావు కాబట్టి ఇక తప్పక తప్పనిసరిగా ఉత్తరాలతో తంటాలు పడేవాళ్ళు! అవునా...!

ఆ మధ్య బీరువాలో నువ్వు భద్రంగా దాచుకున్న ఉత్తరాల్నిచూశాలే! అమ్మో... కొన్ని ఉత్తరాలయితే ఇన్ని పేజీలున్నట్లుగా బరువుగా ఉన్నాయ్! అబ్బ! అంతంత పెద్ద ఉత్తరాలు రాయటం, చదవటం బోర్‌కాదూ...!" భుజాలెగరేస్తూ అన్నావు.

నాకు చాలా ఆశ్చర్యంగా అనిపించింది! మీ తరం వాళ్ళకి ఉత్తరాలు రాసే ఓపిక లేదంటే... నిజమే, ఒప్పుకుంటాను! కానీ ఉత్తరాలు రాయటం, అందుకోవటంలోని అనుభూతి నీకసలు తెలియదు కాబట్టి బోర్ అని పొరబడుతున్నావని మాత్రం చెప్పగలను. మామూలుగా ఏవో వ్యవహారాల నిమిత్తం రాసే ఉత్తరాలూ... కేవలం క్షేమ సమాచారాలతో ముగిసే ఉత్తరాలూ... వాటి సంగతి వదిలేస్తే, ఆత్మీయుల పలకరింపుతో వచ్చిన ఉత్తరం పన్నీటి చిలకరింపులా ఎంతటి హాయినీ... ఆహ్లాదాన్నీ అందిస్తుందో నీకేం తెలుసూ...!!

నేనిప్పటికీ దాచుకున్న ఆ ఉత్తరాలలో మహత్తరమైన విషయాలేం లేవు. మామూలు సంగతులే! అయితేనేం ఆ ఉత్తరాలు... ఎన్నెన్నో మధురానుభూతుల దొంతరలు! పూలవంతెనలు!! ఎప్పుడైనా తీరుబడిగా ఉన్నప్పుడు ఏకాంతంలో ఆ ఉత్తరాల్ని చదివితే... మళ్ళీ ఆ రోజులలోకి మనసు జారిపోతుంది. జ్ఞాపకాల కొలనులో మునకలేస్తూ మైమరచిపోతుంది! ఈ రోజు నీకూ ఆ ముచ్చట్లు కొన్ని చెప్పాలనిపించింది.

* * *

హైస్కూలు రోజులలో నాకు 'నిర్మల' అనే స్నేహితురాలుండేది. క్లాసురూములో మా సీట్లు వేర్వేరుచోట్ల ఉండేవి కానీ బయటమాత్రం ఇద్దరం ఎప్పుడూ కలిసే ఉండేవాళ్ళం. మా క్లాసువాళ్ళు మమ్మల్ని 'మిత్రద్వయం' అనే వాళ్ళు. లంచ్ అవర్లో మా క్లాసురూముకి దగ్గరగా ఉన్న చెట్టునీడలో పచ్చగడ్డిలో అయిదారుగురం గుండ్రంగా కూర్చుని తెచ్చుకున్న కారియర్లలోని భోజనాలు చేసేవాళ్ళం. ఒకరోజు ఆ సమయంలోనే నిర్మలకీ నాకూ ఏదో విషయం మీద వాదన వచ్చింది. మాటామాటా పెరిగి 'నీతో మాట్లాడటం అనవసరం' అని ఒకరంటే, 'నీతో మాట్లాడనసలు' అని ఇంకొకరం అనుకున్నాం. పక్కనున్న వాళ్ళు 'ఇంకో గంటసేపట్లో చెట్టాపట్టాలేసుకునేవాళ్ళు ఎందుకలా శపథాలు చేసుకోవటం?' అన్నారు. అలాకాదు 'మేం మాట్లాడుకోమ'ని అన్నాం. 'పందెమా?' అని వాళ్ళు అంటే 'పందెమే' అని ఇద్దరం అన్నాం. 'ఇద్దర్లో ఎవరు ఇంకొకరిని ముందుగా పలకరిస్తే, వాళ్ళు ఓడిపోయినట్లు లెక్క. ఓడిన వాళ్ళు అక్కడున్న అందరికీ హల్వా ఇప్పించాలి' అని షరతుపెట్టారు. మా స్కూలుకి దగ్గర్లోనే వున్న స్వీటుషాపులోని బాదం హల్వా అంటే మా అందరికీ బాగా ఇష్టం! మేం 'అలాగే' అన్నాం.

వారం రోజులు ఇద్దరం మాట్లాడుకోలేదు. ఆ తరువాత ఒకరోజు నిర్మల పలకరింపుగా చూసి చిన్నగా నవ్వింది. నేను తల తిప్పేసుకున్నాను. మళ్ళీ సాయంకాలం ఇంటికి వెళ్ళేటప్పుడూ మెల్లిగా నవ్వింది. నేను నవ్వలేదు.

ఇంటికి వచ్చేసరికి మద్రాసులో చదువుకుంటున్న అన్నయ్య దగ్గర్నుంచి వచ్చిన ఉత్తరం ఉంది. అమ్మా, నాన్నగార్లకే కాకుండా అన్నయ్య నా పేరు మీద వేరేగా పదిరోజులకో ఉత్తరమైనా రాసేవాడు. అన్నయ్య ఉత్తరాలు వర్ణనలతో మళ్ళీమళ్ళీ చదవాలనిపించేట్లుగా ఉండేవి! తన రూముకి ఎదురుగా ఉన్న స్థలంలో కడుతున్న మేడలో పనిచేసే కూలీలను గమనిస్తోంటే తనకేమనిపించిందీ...

బీచ్‌కెళ్ళినపుడు సముద్రపుటలలను చూస్తూంటే తనకెలాంటి భావాలు కలిగిందీ... ఇలా అన్నిటి గురించీ తన స్పందనలూ... ఎన్నో సంగతులూ రాసేవాడు. అప్పటికి నేను మద్రాసు చూడకపోయినా, అన్నయ్య ఉత్తరాల వల్ల మద్రాసంతా చూసినట్లుగా, అన్నయ్య కాలేజీలోని వాళ్ళంతా నాకూ తెలిసినట్లుగా అనిపించేది! కొందరి ఉత్తరాల్లో అలాంటి ప్రత్యేకత ఉంటుంది. కళ్ళకు కట్టినట్లుగా రాయగలుగుతారు మరి!

అన్నయ్య దగ్గర్నుండి ఉత్తరం వచ్చినరోజు నాకు నిజంగా పండుగలాగే ఉండేది! నిర్మల కూడా అన్నయ్య రాసే ఉత్తరాలను చాలా ఇష్టంగా, ఆసక్తిగా చదివేది! అన్నయ్య దగ్గర్నుంచి ఉత్తరం వచ్చిందని చెబితే, చదవటానికి స్కూలు నుంచి మా ఇంటికి వచ్చేది. ఇప్పుడు మా ఇద్దరికీ మాటల్లేవు కాబట్టి నేను చెప్పటానికీ లేదు, తనూ రాదు.

అప్పుడు ఒక ఆలోచన వచ్చింది. అన్నయ్య ఉత్తరంలోని విశేషాలూ, ఆ వారం రోజుల కబుర్లు అన్నీ నాలుగు పేజీల నిండా రాసేశాను. ఆ మరునాడు ఉదయం స్కూలుకి కొంచెం ముందుగా బయలుదేరివెళ్ళి ఆ ఉత్తరాన్ని తన డెస్కులోపెట్టాను. నిర్మల సీటు నాకంటే మూడు వరసల ముందుండేది. అందుకే క్లాసులోకి వచ్చాక తను ఉత్తరాన్ని తీయటం, చదవటం అన్నీ గమనిస్తూనే ఉన్నాను. చదివాక వెనక్కు తిరిగి కళ్ళతోనే తన ఆనందాన్ని వ్యక్తం చేసింది. ఆ మరునాడు నేనూహించినట్లుగానే నా డెస్కులో తన ఉత్తరం ఉంది! నా ఉత్తరం తనకెంత ఆనందాన్ని కలగజేసిందో... ఆ వారం రోజులూ తనెంత వెలితిగా ఫీలయిందో చెబుతూ, తను అందుకున్న ఆ మొదటి ఉత్తరాన్ని ఎప్పటికీ దాచుకుంటానని రాసింది! ఇద్దరం అలా ఉత్తరాల ద్వారా కబుర్లు చెప్పుకోవటం చాలా థ్రిల్లింగ్‌గా, సరదాగా ఉండేది!

ఆరోజు స్కూలుకి వచ్చాక డెస్కులో పుస్తకాలు పెట్టుకుని బయటకు వచ్చి కూర్చున్నా. బెల్ అయ్యాక లోపలకి వచ్చా. నా పుస్తకాలపై ఉన్న నిర్మల ఉత్తరాన్ని నోట్సులో పెట్టుకుని చదువుకున్నా. ఆ తరవాత పుస్తకాల పక్కనే పెట్టిన నా పెన్ను కోసం చూసుకుంటే లేదు! డెస్కులో పెట్టినట్లుగా బాగా గుర్తుంది. పెన్ను లేకపోయేసరికి ఏడుపు వచ్చినంత పనైంది. అది అన్నయ్య నా బర్త్‌డేకి గిఫ్టుగా ఇచ్చిన ఖరీదైన పెన్ను. ఎవరైనా ఒకసారి రాసుకోవటానికి అడిగినా ఇవ్వలేదెప్పుడూ.

టీచర్ రాగానే పెన్ పోయిన విషయం చెప్పాను. డెస్కులో పెట్టిన పెన్ ఎవరో ఒకరు తీసి ఉండాలి కాబట్టి. తీసినవాళ్లు వెంటనే తిరిగి ఇచ్చేస్తే మొదటి తప్పుగా క్షమిస్తానని చెప్పారు. ఎవరూ మాట్లాడలేదు. టీచర్ కోపంగా వార్నింగ్ ఇచ్చారు. తమంత తాముగా ఇవ్వకపోతే, తెలుసుకున్నాక పనిష్‌మెంట్ తప్పదని! సీత అనే అమ్మాయి లేచి నిలబడి తను క్లాసురూములోకి వస్తున్నప్పుడు నిర్మల హడావుడిగా నా డెస్కు మూత వేసేసి తన సీటుదగ్గరకు వెళ్ళిపోవటం చూశానని చెప్పింది. టీచర్ నిర్మలను లేచి నిలబడమన్నారు.

నాకు పరిస్థితి అర్థమైంది! నిర్మల నా డెస్కు తెరించింది కాబట్టి తనే నా పెన్ తీసి ఉండొచ్చని టీచర్ అనుమానిస్తారని అనిపించింది. అందుకే నేను కంగారుగా లేచి నిలబడి “క్షమించండి టీచర్. స్కూలుకి బయలుదేరి వస్తున్నప్పుడే నాన్నగారు ఒకసారి నా పెన్ అడిగితే ఇచ్చి తీసుకోవటం మరిచిపోయి వచ్చేశాను. సరిగ్గా ఇప్పుడే గుర్తుకువచ్చింది. నిర్మలకి నిన్న నేను ఇచ్చిన నోట్సు నా పుస్తకాలపై పెట్టింది. సారీ టీచర్” అని చెప్పాను.

బిక్కమొహంతో నిలబడిన నిర్మలను కూర్చోమని చెప్పి టీచర్ నాకు బాగా చివాట్లుపెట్టారు. తలవంచుకుని మౌనంగా నిలబడ్డాను. నిర్మల తలవంచుకుని నిశ్శబ్దంగా ఏడవటం టీచర్ చూశారు. “చివాట్లు తిన్న అమ్మాయి మామూలుగా ఉంది, మధ్యలో నీవెందుకూ ఏడవటం, నిన్నేం అనలేదుగా?”

టీచర్ గట్టిగా అడిగేసరికి నిర్మల లేచి నిలబడి మెల్లగా వెక్కుతూనే "తను నా ఫ్రెండు టీచర్" అంది. టీచర్ ఒక క్షణం విచిత్రంగా చూసి ఏమనుకున్నారో ఏమోగానీ "కూర్చోండిక" అన్నారు. ఇక తరువాత టీచర్ చెప్పిన పాఠం ఒక్కముక్క కూడా నా తలకెక్కలేదు. టీచర్ నన్ను తిడుతూంటే కన్నీళ్ళు పెడుతూ తను నా ఫ్రెండు టీచర్ అని చెప్పిన నిర్మల మాటలే మనసులో మళ్ళీ మళ్ళీ వినబడుతూ మురిపించాయి! రెండు పిరియడ్స్ తరువాత వచ్చే ఇంటర్‌వెల్‌లో ఫ్రెండ్సంతా నా పక్కనచేరారు. శ్రీశివల్లి అనే అమ్మాయి "టీచర్‌కి అప్పటికప్పుడే భలే కథ చెప్పేశావే! పెన్ను మీ నాన్నగారికి ఇచ్చావా...మ్మా!" వ్యంగ్యంగా సాగదీస్తూ అంది.

శ్రీశివల్లి మా ఫ్రెండ్స్ గ్రూప్‌లోని అమ్మాయికాదు. తను రోజుకోరకంగా మోడరన్‌గా తయారై వస్తూండేది. ఎందుకో మా ఫ్రెండ్స్ తనకి స్టైలు ఎక్కువ, ఫోజెక్కువ అనుకునే వాళ్ళు. ఒకసారి తను మంత్లీ టెస్ట్‌లు రాసే నా నోట్సు తీసుకుని చూసి తెలుగు టీచర్ ఇంప్రెషన్‌తో నాకు అనవసరంగా ఎక్కువ మార్కులు వేయటం వల్ల ఫస్టుమార్కు వచ్చిందనీ, లేకపోతే తనకే రావాల్సిందనీ అందరితో చెప్పింది. అందువల్ల కూడా తనంటే నాకు కోపం. ఇష్టం ఉండేదికాదు.

"కథ చెప్పానో... నిజమే చెప్పానో నీకేం తెలుసూ?" కోపంగా అన్నాను. "ఎలా తెలుసంటే... ఇదిగో, ఇది నా దగ్గరుంది కాబట్టీ" అంటూ నా పెన్‌ని చూపింది. దాన్ని గబుక్కున లాక్కుని 'నీ దగ్గరకు ఎలా వచ్చిందీ?" అని అడిగాను.

"ఎప్పుడైనా ఒక్కసారి అడిగినా ఇవ్వవుకదా. పోతే ఏం చేస్తావో చూద్దామని ఏడిపించటానికి నేనే తీశా" అంది నవ్వుతూ.

"ఒకళ్లని ఏడిపించి సరదాపడటం అంత మంచిలక్షణం కాదు" సీరియస్‌గా అన్నాను.

"అబ్బో! అబద్ధాలు చెప్పడం మంచి లక్షణం కాబోలే! నిర్మలతో నీకసలు మాటలే లేకపోతే తనకి నోట్సు ఇచ్చానని చెబుతున్నావ్?" వేళాకోళంగా అంది. నిర్మల నా డెస్కు దగ్గరకు ఎందుకు వచ్చిందీ అని ఆరా తీశారు. మా ఉత్తరాల సంగతి బయటకు వచ్చింది. అయితే ఓడిన వాళ్ళు ఎవరు? హల్వా ఇప్పించాలిగా అన్నారు. "ముందుగా నేను నవ్వాను కాబట్టి నేనే ఓడిపోయాలే, నేను తెప్పిస్తానని" నిర్మల అంటే, "ముందుగా పలకరిస్తూ ఉత్తరం రాశాను కాబట్టి నేను ఓడిపోయినట్లు, నేను తెప్పిస్తానని అన్నాను. "ఇద్దరూ కలిసి తెప్పించండి" అని ఒకరు సలహా ఇస్తే ఇంకొకరు "ఇద్దరూ కూడా తెప్పించండి" అన్నారు. చివరకు ఇద్దరం తెప్పించాం.

ఆ రోజు సాయంత్రం ఇంటికెళ్లిపోయేటప్పుడు శ్రీశివల్లి నాకు 'సారీ' చెప్పింది. నేను ముభావంగా ఊరుకున్నాను. తను ఆ మరుసటి నెలలోనే వాళ్ల నాన్నగారికి ట్రాన్స్‌ఫర్ అయినందువల్ల టి.సి. తీసుకుని వెళ్లిపోయింది. వెళ్లిన పదిరోజులకి నా పేర ఉత్తరం రాసింది స్కూలు అడ్రసుకి. ఉత్తరం మాత్రం నిర్మలకీ, నాకూ కలపి నిర్మలా వందనకు అంటూ రాసింది.

"మీ ఇద్దరూ విడదీయబడని 'మిత్రద్వయం' కాబట్టి కలిపి ఒకే ఉత్తరం రాస్తున్నాను. మన స్కూలు, మీరు... అంతా తరచూ గుర్తుకు వస్తున్నారు. నేను మీ ఇద్దరి మధ్యకూ చేరి 'ద్వయం' అనే మాటని చెరిపేసి 'త్రయం' చేయాలని అనుకున్నాను. కానీ బేడ్‌లక్! ఇక్కడకు రావాల్సి వచ్చింది" అని రాసింది. ఇంకా వాళ్ల స్కూలు గురించీ రాసింది.

"నిర్మలా వందనకు" అని తను రాసిన ఉత్తరాన్ని ఎప్పుడైనా చదివితే... స్కూలు జీవితం అంతా కళ్లముందు కదులుతుంది. పరీక్షలు... ఫస్ట్‌మార్కుల కోసం పోటీలు... సెలవుల్లో సరదాలు...

పోట్లాటలు... కబుర్లు... నవ్వులు... అన్నీ గుర్తుకు వచ్చి రంగులరాట్నమెక్కి ఒక్కసారి గిర్రున తిరిగి వచ్చినట్లు ఉత్సాహంగా ఉంటుంది. ఏదైనా జరిగినప్పుడు అనుభవించిన ఆనందం కంటే దానిని తలుచుకునేటప్పుడు కలిగే అనందమే మరింతగా ఉంటుందనుకుంటా!

నిర్మల హైస్కూలు చదువుతోటే ఫుల్‌స్టాఫ్ పెట్టేసింది. వాళ్ళ బావతో పెళ్లయింది. అత్తారింటి నుంచి అప్పుడప్పుడూ ఉత్తరాలు రాస్తూనే ఉండేది. నేను కాలేజీలో చేరిన నాలుగు రోజులకి శ్రీశీవల్లి కూడా చేరింది. మా గ్రూపులోనే వాళ్ల నాన్నగారికి మళ్ళీ అక్కడికే ట్రాన్స్‌ఫరయిందిట. మూడేళ్ళ తరవాత మళ్ళీ కలిసినందుకు తను చాలా ఆనందించింది. నా పక్కనే కూర్చునేది. రోజులు గడిచేకొద్దీ తనంటే మునుపు ఉన్న అయిష్టంపోయింది. స్నేహం పెరిగింది. చిత్రంగా ఒక సంవత్సరంలోనే మేం ప్రాణస్నేహితులమైపోయాం.

దసరాకీ, సంక్రాంతికీ ఇచ్చే పదిరోజుల సెలవుల్లో కూడా మా మధ్య లోకల్ లెటర్సు నడుస్తూ ఉండేవి! చిన్న పడవలూ, పూలగుత్తులూ లాంటి బొమ్మలున్న లెటర్‌పాడ్‌లూ, పేజీ చివర మంచి మంచి కొటేషన్సు ప్రింట్‌చేసి వుండే లెటర్ పాడ్‌లు వల్లి కొంటుండేది. లేకపోతే ఒక్కోసారి అందమైన బొమ్మలూ, పూలగుత్తులూ ఎక్కడైనా కట్‌చేసినవి చివర అతికించేది. తన దస్తూరీ కూడా అరవిచ్చిన మల్లెల్నీ, మంచి ముత్యాలనీ గుర్తుకు తెచ్చేంత ముచ్చటగా ఉండేది! ఇక తను ఉత్తరాలు రాసే ధోరణి అయితే చాలా హ్యూమరస్‌గా ఉండేది. వాళ్ళ తమ్ముళ్ళు చెప్పిన జోక్స్, ఇంట్లో జరిగే సరదా సంఘటనలూ అన్నీ రాసేస్తూ ఉండేది.

“ఈరోజు ఏమైందో తెలుసా! అమ్మకి ఒంట్లో బాగాలేక ఉదయం లేవలేదు. ఇక ఈరోజు వంట నేనే చేశాలే ఏదో చేతయినట్లు... మా తమ్ముడు గిరిగాడు వచ్చి తను బయటికెళ్ళాలని తొందరగా భోజనం పెట్టమన్నాడు. వంట పూర్తికాలేదప్పటికి. ‘అన్నంసగమే ఉడికిందిరా, కాస్సేపుండాలి’ అని నేనంటే వాడు ఆ సగం నాకు ముందు పెట్టు అన్నాడు! బావుంది కదూ!” ఎదురుగా కూర్చుని జోక్స్ చెబుతున్నట్లుగా అలా సాగిపోయేవి తన ఉత్తరాలు! ఇప్పటికీ తన ఉత్తరాలు కొన్ని చదువుతుంటే... నవ్వుల నవపారిజాతాలు విరిసిన నందన వనంలోకి అలా అలా షికారు కెళ్ళొచ్చినట్లుగా ఖుషీఖుషీగా ఉంటుంది! రంగుల హరివిల్లునెక్కి స్వారీ చేస్తున్నట్లుగా అనిపించే మజామజా కాలేజీ జీవితం పూర్తయ్యింది! నాలుగేళ్ళు ఇట్టే గడిచిపోయాయి! పెళ్ళిచూపుల ఘట్టాలు ప్రారంభం అయ్యాయి.

ఒక రోజు నేను వల్లీ వాళ్లింటికి వెళ్ళేసరికి అయిదారుగురు పెద్దలు కారెక్కి బయలుదేరి వెళ్ళిపోతున్నారు. వాళ్ళల్లో చిన్న వయసున్నతణ్ణి చూసి పెళ్ళికొడుకయి ఉంటాడనీ, వల్లికి పెళ్ళిచూపులు జరిగి ఉండొొచ్చనీ అనుకున్నాను. అది కరెక్టే అయింది. నేను వల్లి నాన్నగారిని అతని వివరాల్ని అడిగితే చెప్పి “వాళ్ళ ఆస్తిపాస్తుల వివరాలన్నీ మాకు ముందుగా చెప్పి వుంటే, పెళ్ళిచూపులకి రమ్మనేవాళ్ళం కాదు. మనం తూగగలిగే సంబంధం కాదు” అన్నారు. ఆ తరువాత నేను వల్లితో అతని గురించి మాట్లాడుతోంటే వల్లి ఏ మాత్రం ఉత్సాహం చూపించకుండా “అబ్బ! వదిలెయ్యవే బాబూ అతని గొడవ! నాన్నగారు చెప్పారుగా, జరగదని తెలిశాక కూడా ఎందుకూ అనవసరంగా ఆలోచనలు చేయటం” అంది. నాకు వాళ్ళిద్దరి జంట చాలా బావుంటుందనిపించింది. రెండు రోజుల తరవాత అతనికి ఉత్తరం రాద్దామనిపించి రాశాను.

రామచంద్రమూర్తి గారూ!

నమస్తే. నేనెవరో మీకు తెలియదు. పరిచయం చేసుకుంటాను. నా పేరు వందన. శ్రీశీ వల్లికి స్నేహితురాలిని.

నేనిలా ఉత్తరం రాయటాన్ని మీరు మరోలా అర్థం చేసుకోరనే నమ్మకం నాకుంది. ఎందుకంటారా... మీ పేరే మంచికి మారుపేరు కదండీ! (మంచి బాలుడు రాము అని అంతా అంటుంటారుగా). మొన్న వల్లీ వాళ్ళింటినుంచి మీరు సరిగ్గా వెళ్ళిపోతున్న సమయంలోనే నేను వచ్చాను. ఒక్కక్షణం మిమ్మల్ని చూశాను. మీ పేరును నిలబెట్టే రకమేనని అనిపించారు చూడగానే! అందుకే ధైర్యంగా ఉత్తరం రాస్తున్నాను.

మీరు వాళ్ళింట్లో ఉన్న గంటసేపు సమయంలోనూ వల్లి ఎలా ఉంటుందో చూసి ఉంటారు. కానీ తనెలాంటిదో తెలుసుకునే అవకాశం మాత్రం ఉండదుగా! అందుకే వల్లితో నాలుగేళ్ళుగా పరిచయం, స్నేహం ఉన్న నేను మీకాసాయం ఎందుకు చేసి పెట్టకూడదూ అనిపించింది.

మీరు చూశారుగా... వల్లి పెదవులపై ఎప్పుడూ ఓ బుల్లినవ్వు పిల్లిమొగ్గలేస్తున్నట్లే ఉంటుంది. అలాంటి నవ్వు మొహం ఉన్న అమ్మాయి నట్టింట్లో తిరుగుతుంటే, ఆ ఇంటి దరిదాపులకి కూడా కష్టాలనేవి రానేరావట! ఎలా అని అడుగుతున్నారా...? ఆ చిరునవ్వుల వెన్నెల ఎదుటివాళ్ళ మనసులకు సాంత్వన చేకూరుస్తుంది. కష్టాలనూ, సమస్యలనూ ఎదుర్కొనే శక్తినీ, ఉత్సాహాన్నీ అందిస్తుంది! అందువల్ల కష్టాలు కష్టాలుగా అనిపించవు! సో... అన్నీ సుఖాలేనన్నమాట! అదండీ సంగతి!

వల్లిది నవ్వు మొహం మాత్రమే కాదండోయ్... మనసు కూడా పువ్వులాంటిదే! తను జీవిత భాగస్వామిగా తోడుంటే... ప్రతి రోజూ పండుగవుతుంది! ఇల్లు నిండుపున్నమికి నెలవవుతుంది! సుఖశాంతులకు కొలువవుతుంది! తనతో ఏ కొద్ది పరిచయం ఉన్నవాళ్ళయినా ఈ విషయాలన్నీ కరెక్టేనని సర్టిఫై చేసేస్తారు, ఏ మాత్రం సంకోచించకుండా! కట్నకానుకల విషయంలో మీ అంచనాకు తగ్గొచ్చునేమో కానీ వ్యక్తిగా మాత్రం తను ఎన్నో విషయాలలో మిన్న అని చెప్పగలను!

నేనిలా ఉత్తరం రాస్తున్నట్లుగా వల్లికీ, వాళ్ళింట్లో వాళ్ళకీ చెప్పలేదు. వాళ్ళ నాన్నగారు చెప్పిన వివరాలనుబట్టి మీ అడ్రసుతెలుసుకున్నాను. అతి చనువు తీసుకున్నానని అనిపిస్తే మన్నించండి. మీ అదృష్టం మంచిదైతే, మనం మళ్ళీ కలుసుకునే అవకాశం ఉంటుంది. అర్థమైందనుకుంటా!

– వందన

ఆ ఉత్తరాన్ని రాశాక పోస్టు చేయాలా వద్దా అని చాలాసేపు ఆలోచించాక చివరకు చేశాను. నాలుగు రోజుల తరవాత వల్లి నుంచి కబురు వచ్చింది. ఆ సంబంధం నిశ్చయమైందని! నాకు చాలా సంతోషమేసింది. పదిరోజుల్లోనే మహూర్తం కుదిరింది. పెళ్ళిలో వల్లి నన్ను అతనికి పరిచయం చేస్తూ 'నా ఫ్రెండు' అని చెప్పి పేరు చెప్పబోతుంటే అడ్డు తగిలి 'వందనా?' అనడిగాడు. "అవును! మీకు ఎలా తెలుసూ?" అని వల్లి ఆశ్చర్యపోతే అతను "నాకు పెన్ ఫ్రెండులే" అన్నాడు. నాతో "మిమ్మల్ని కలుసుకునే అవకాశం కలిగినందుకు నా అదృష్టాన్ని అభినందించండి" అన్నాడు చమత్కారంగా నా ఉత్తరంలోని మాటను గుర్తుచేస్తూ. నేను 'కంగ్రాట్స్' అంటూ నవ్వేశాను. వల్లి అయోమయంగా చూస్తుంటే "తరవాత చెబుతాలే" అన్నాడతను నవ్వుతూ.

వల్లి అత్తవారింటికి వెళ్లిన వారం రోజులకి ఉత్తరం రాసింది. నా ఉత్తరం సంగతి అతను చెప్పాడట! ఎటూ తేల్చుకోలేక అటూఇటూగా ఊగిసలాడుతున్న అతని మనసు నా ఉత్తరాన్ని చదివాక

ఒక స్థిర నిర్ణయానికి వచ్చేసిందట! పట్టుబట్టివాళ్ళ పెద్దవాళ్ళను ఒప్పించాడట! 'వందనా, నువ్వు తనకి రాసిన ఉత్తరాన్ని చదువుతుంటే నాకు ఆనందంతో కన్నీళ్ళు వచ్చేశాయ్' అంటూ రాసింది. వెనక పేజీలో పెద్ద పువ్వును పెయింట్ చేసింది దాని పక్కగా ఇలా రాసింది – 'మంచి చెలిమిని మించిన కలిమి ఏముంటుందీ! నన్ను సంపన్నురాలిని చేసిన స్నేహమయీ ఇదిగో ఇది నీ కోసం... నా మనసే విరిసిన వేయిరేకుల స్నేహకుసుమం!'

ఆ ఉత్తరాన్ని చేతుల్లో పెట్టుకుని అలా చాలా సేపు కూర్చుండిపోయాను! ఆ పువ్వును వేళ్ళతో స్పృశిస్తూ మనసులో ఆనందంగా అనుకున్నాను... నిజమైన స్నేహాన్ని మించిన అదృష్టం ఉంటుందా ఎవరికైనా! నేనూ అదృష్టవంతురాలినే!

వల్లి అప్పుడప్పుడూ ఉత్తరాలు రాస్తూనే వుంది. ఒకసారి ఇక్కడకు ఆఫీసు పనిమీద వస్తున్న తన మరిది ఫ్రెండు వినయ్‌తో నాకోసం కొన్న రెండు నవలలను పంపిస్తున్నానని రాసింది. నాన్నగారికీ వేరేగా ఉత్తరం రాసింది. అతని వివరాలన్నీ రాసి మా ఇద్దరికీ ఇష్టమైతే పెళ్ళిగురించి పెద్దవాళ్ళతో మాట్లాడవచ్చని రాసింది.

అతను వచ్చాడు. అమ్మానాన్నగారు అతిథిమర్యాదలు చేశారు. ముందుగదిలో కూర్చున్నాం. నాన్నగారు లోపలకు లేచివెళ్ళాక అతను తన ఉద్యోగం గురించి కాస్సేపు ఏవో సంగతులు చెప్పి "మీ అభిప్రాయం ఏమిటి, ఇష్టమేనా?" అనడిగాడు. ఏం చెప్పగలను! నవ్వేసి ఊరుకున్నాను. ఇంతలో నాన్నగారు వచ్చారు. కాసేపుండి వెళ్ళటానికి లేచాడు. నాన్నగారితోపాటుగా గేటువరకూ వెళ్ళిన అతను 'ఒక్క నిముషం... మర్చిపోయాను' అంటూ వెనక్కి తిరిగి వచ్చి గుమ్మం దగ్గరే నిలబడిన నాకు పుస్తకాల పాకెట్టును అందించి "మీ నాన్నగారికి చెబుదామంటే మీ ఇష్టమేమిటో తెలియలేదు. నన్ను రేపు లంచ్‌కి రమ్మన్నారు. అప్పుడైనా చెబుతారా?" మెల్లని స్వరంతో నాకు మాత్రమే వినిపించేట్లుగా చెప్పి చకచకా వెళ్ళిపోయాడు.

ఆ మరునాడు ఆఫీసు పనిలో లేటయిందని రావటమే ఆలస్యంగా వచ్చాడు. భోంచేసిన వెంటనే వెళ్తేనేగానీ అతనికి ట్రైను అందదు. అందుకని అమ్మ నాన్నగారికీ, అతనికీ రావడమే ఆలస్యం వడ్డించేసింది. నేను అమ్మకి అవీ ఇవీ అందిస్తూ తిరుగుతున్నాను. 'ఎలా చెప్పటం... ఎప్పుడు చెప్పటం' అనే ప్రశ్న మనసును వేధిస్తోంది. గదిలోకి వెళ్ళి ఒక కాగితం తీసుకుని తొందర తొందరగా ఒకే ఒక వాక్యం రాసేశాను.

'మీ చూపుల చంద్రకిరణాలు సోకగానే వికసించిన నా వదన కమలంలో మీకు జవాబు కనిపించలేదా? వేరే చెప్పాలా!' ఆ కాగితాన్ని కవరులోపెట్టి అతికించి పైన అతని పేరూ, మా అడ్రసూ రాశాను. భోజనం పూర్తిచేసి టవలుతో చేతులు తుడుచుకుంటుంటే "మధ్యాహ్నం పోస్టులో మీకు ఉత్తరం వచ్చింది. ఈ అడ్రసు ఎవరికైనా ఇచ్చారా?" అంటూ అతనికి అందించాను. అతను తీసుకుని ఆశ్చర్యంగా చూసి, చింపి కాగితం తీసి చదివాడు. ఒక క్షణం అతని పెదవులపై చిన్న చిరునవ్వు మెరిసింది. ఆ కవరును జేబులో పెట్టుకుని హడావుడిగా వెళ్ళిపోయాడు. గేటువరకూ సాగనంపి వచ్చిన నాన్నగారు, "వచ్చేవారం వాళ్ళ అమ్మా, నాన్న, బంధువులూ వస్తారట" అని చెప్పారు.

వారం తరవాత వాళ్ళంతా వచ్చారు. తాంబూలాలు పుచ్చుకున్నారు. మూఢమని, అదనీ, ఇదనీ చెప్పి రెండు నెలల తరవాత ముహూర్తం పెట్టారు. వాళ్ళు వెళ్ళిపోయిన నాలుగు రోజులకు అతని దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది.

'ఎవరి ఉత్తరానికైనా వెంటనే జవాబు రాయటం నాకలవాటు. అందుకే మీ ఉత్తరానికి జవాబు రాస్తున్నాను. ఒకే ఒక్క వాక్యంతో మీరు రాసిన ఆ చిన్న ఉత్తరం నా మనసును చిత్తుచిత్తు చేసేసింది.' అంటూ తన ఇష్టాయిష్టాల గురించీ, కుటుంబం గురించీ రాసి ప్రత్యుత్తురాన్ని ఆశిస్తున్నానంటూ ముగించాడు.

ఆ రోజు రాత్రే నేను జవాబు రాసేశాను. ముహూర్తం నాలుగు రోజుల ముందువరకూ మా మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు సాగాయి.

ఉత్తరం వస్తుందనుకున్న రోజు మధ్యాహ్నం వీధి గుమ్మందగ్గరే తారట్లాడేదాన్ని. అంతదూరంలో పోస్ట్‌మాన్ కనిపించగానే, ఎవరో ఆత్మబంధువుని చూసినట్లుగా ఆనందోత్సాహం... అతను వస్తోంటే, మా గేటు దగ్గర ఆగుతాడా, లేదా అని ఆశనిరాశల ఊగిసలాట... ఆగితే అతనిచ్చే ఉత్తరాల్లో నేనెదురుచూసేది ఉంటుందా లేదా అని ఆ రెండు క్షణాల్లోనే ఉత్కంఠ... ఉండకపోతే మనసంతా మబ్బులు కమ్మిన ఆకాశం... ఉంటే పూర్ణచంద్రోదయమే! ఆ ఉత్తరాన్ని చేతిలోకి తీసుకుంటేనే... శీతాకాలపు నీ రెండలో నిలబడినట్లుగా నులివెచ్చని అనుభూతి కలిగేది! ఇక ఆ ఉత్తరాన్ని ఒకసారి హడావుడిగా చదివి, తరవాత నిదానంగా చదివి, రాత్రికి అందరూ నిద్రపోయాక ఒంటరిగా పడుకుని మళ్ళీ మళ్ళీ చదువుకుంటే మనసంతా పులకింతల వెల్లువే! మల్లీజాజుల జల్లులే!!

అలా మా మధ్య ఉత్తరాలు సాగడం వల్లే పెళ్ళినాటికే మేం ఒకరికొకరు బాగా పరిచయం ఉన్నట్లుగా... మంచి స్నేహితులమైనట్లుగా అనిపించింది. ఆ ఉత్తరాల్లో అప్పుడు మొలకెత్తిన ప్రేమ పెళ్ళి తరువాత రోజురోజుకీ పెరిగి, మరింతగా బలపడింది.

* * *

పెళ్ళి తరవాత వెంటనే కాపురానికి వెళ్ళిపోయాను. దగ్గర ఊరే కాబట్టి ఎప్పుడు ఇంటికి వచ్చినా రెండు రోజుల కంటే ఉండేదాన్ని కాదు. సంవత్సరం తరువాత దూరంగా ట్రాన్స్‌ఫరయింది. ఒకసారి పదిరోజులుండడానికని ఇంటికి వచ్చాను. మా వదిన చెల్లెలు అమెరికా నుంచి వస్తోందని అమ్మ, వదిన నన్ను ఇంకో వారం ఉండమన్నారు. తనకీ, నాకూ స్నేహం ఉంది. సరేనని వినయ్‌కి ఆ విషయం రాశాను. వెంటనే జవాబు వచ్చింది.

వందనా...

ఇంకో వారం రోజులు ఉంటానని రాశావు. ఇక్కడ నా పరిస్థితి ఎలా ఉందో తెలుసా? పగలంతా ఆఫీసు పనితో ఎలాగో గడిచిపోతోంది. సాయంకాలం ఫ్రెండ్సుతో గడిపి, చీకటిపడ్డాక ఇంటికి వస్తానా... అప్పుడు లైటువేస్తే, అదేమిటో చిత్రంగా బల్బు వెలుగుతుందికానీ చీకటి మాత్రం రెట్టింపవుతుంది! అంటే... ఈ ఇంటి వెలుగూ, వెన్నెలా నీవెంటే వెళ్ళిపోయాయి కాబోలు! ఈ ఒంటరితనపు చీకటిలో నేనుండలేకపోతున్నాను మరి వెంటనే బయలుదేరిరావూ...? వెలుగు వెన్నెలని తేవూ...!

– వినయ్

ఆ ఉత్తరాన్ని చదివాక ఇక ఒక్కరోజు కూడా ఉండలేకపోయాను. ఏవో కారణాలు చెప్పి వెంటనే బయలుదేరాను. బెర్త్‌లేక రాత్రంతా కూర్చోవలసి వచ్చినా కష్టంగా అనిపించలేదు. ఉత్తరంలోని ఆ మాటలే గుండెలోంచి గుసగుసగా వినిపిస్తుంటే... మురిపెంగా అనిపించింది! వెంటనే వచ్చెయ్యమని రాస్తే బయలుదేరేదాన్ని కాదేమో! చెప్పేతీరుని బట్టి ఎవరిచేత అయినా ఏ పనైనా చేయించగలుగుతాం కాబోలు! ప్రేమకి లొంగిపోని వాళ్ళూ, పొంగిపోని వాళ్ళూ ఎవరుంటారు...!

పొద్దున్నే సూట్‌కేస్‌తో దిగిన నన్ను చూసి ఆశ్చర్యంతో 'వచ్చేశావా'? అని వినయ్ అంటే "మీ ఉత్తరంలోని అక్షరాలకున్న అయస్కాంతశక్తి అలాంటిది మరి నన్నిక్కడకు వెంటనే లాక్కొచ్చిపడేశాయ్!" అన్నాను నవ్వుతూ.

నాలుగేళ్ళు గడిచాయ్. నువ్వూ, చెల్లీ పుట్టారు. నాన్నకి ప్రమోషన్ వచ్చింది. ఆరునెలలకోసారి అయినా ఒక నెలరోజులపాటు క్యాంపులో ఉండాల్సి వచ్చేది. వెళ్లేటప్పుడు "తుంటరి ఆలోచనలు మనసును దారి మళ్ళించకుండా... ఒంటరితనం తెలియకుండా నేనుండగలగాలంటే... రెండు రోజులకో ఉత్తరమైనా నాలుగు పేజీలకు తగ్గకుండా రాయాలి" అని మాట తీసుకునేవారు.

"ప్రత్యుత్తరం రాకపోతే రాసే ఉత్సాహం నాకూ రాదని తెలుసుగా" అనేదాన్ని.

మూడు నాలుగు రోజులకో ఉత్తరమైనా వచ్చేది. వెంటనే నేనూ రాసేదాన్ని. పగలంతా పనితో గడిచిపోయేది. రాత్రిపూట మీరిద్దరూ నిద్రపోయాక... తీరుబడిగా కూర్చుని ఆరోజు వచ్చిన ఉత్తరం చదువుకుని, ఆ తరవాత మీ ముచ్చట్లూ... ఆ నాలుగురోజులు జరిగిన సంగతులూ అన్నీ రాస్తుంటే... ఇద్దరం దూరంగా ఉన్నామని అనిపించేది కాదు. దగ్గరగా కూర్చుని అన్ని కబుర్లూ కలబోసుకుంటున్నట్లు అనిపించేది!

దగ్గరగా ఉన్నప్పుడు ఒకరిపట్ల ఒకరికి ఉండే ప్రేమ, అభిమానం చెప్పుకోవాల్సిన అవసరం ఉండదు. కానీ దూరంగా ఉన్నప్పుడు ఉత్తరాల్లో ఒకరంటే ఒకరికి ఉన్న తహ తహ... ప్రేమ మాటల్లో వెల్లడి అవుతూ... ఇద్దరం ఇంకా ఇంకా దగ్గరైపోయినట్లూ... ఇద్దరి మధ్యా ఉన్న అనుబంధం మరింత పెరిగినట్లూ అనిపించేది! దూరంలో చేరువ అవటం అంటే అదేనేమో!

యాంత్రికంగా గడిచిపోయే రోజుల్లో అలాంటి ఉత్తరాలు ఎంతటి మధురిమను ఒలికిస్తాయనీ...

ఒకసారి నీకు అయిదేళ్ళ వయసపుడు నాకు ఆరోగ్యం బావుండక రెస్టు తీసుకోమని డాక్టరు చెబితే చెల్లిని తీసుకుని అమ్మమ్మగారింటి దగ్గర పదిహేనురోజులుపైగా ఉన్నాను. నానమ్మ వచ్చి మీ దగ్గరుంది. నాన్న రాసిన ఉత్తరంతోపాటూ నువ్వు అప్పుడప్పుడే నేర్చుకుంటున్న అక్షరాలతో నాన్న సాయంతో చిన్న ఉత్తరం రాశావు. "నువ్వు లేకపోతే ఏమీ బాగాలేదు. తొందరగా వచ్చెయ్యి. ఎప్పుడు వస్తావు?" అంటూ నువ్వు రాసిన ఆ చిన్న ఉత్తరాన్ని మురిపెంగా ఎన్నిసార్లు చదువుకున్నానో...!! నీ చిన్న చేతులను నా మెడచుట్టూ వేసి ముద్దుముద్దుగా మాట్లాడుతున్నట్లే అనిపించింది. ఆ ఉత్తరమూ ఇప్పటికీ నా దగ్గరుంది!

ఇలా ఎన్నో ఉత్తరాలు... ఎన్నెన్నో అనుభూతులు!! ఉత్తరాలు రాయటం, చదువుకోవటంలోని అనుభూతిని మా తరంవాళ్ళూ మర్చిపోతున్నారు. మీ తరం వాళ్ళకి అసలే తెలియదు! నా దగ్గరున్న ఉత్తరాలను కదిలించి, ఆ అత్తరు పరిమళాన్ని నీకు చవిచూపించాలనీ... నీకు తెలియని కొత్త అనుభూతిని పరిచయం చేయాలనీ ఈ ఉత్తరం రాశాను. అర్థమైందిగా!

– అమ్మ

ఈనాడు ఆదివారం. 21, మే, 2000.